ముందుచూపు – విజయానికి మొదటి మెట్టు(వ్యాసం)- నారంశెట్టి ఉమామహేశ్వరరావు

పిల్లలూ ! ఈ నెల వ్యాసాన్ని మనమొక కథతో ప్రారంభిద్దాం. మహాభారతంలో ఉన్న ఈ కథని ధర్మరాజుకు భీష్ముడు చెప్పాడు.

నీటి జంతువులు ఎక్కువగా ఉండే చెరువులో మూడు చేపలుండేవి. వాటి పేర్లు దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు. ఆ మూడూ చాలా స్నేహంగా ఉండేవి.

ఒక రోజు దీర్ఘదర్శి అనే చేప మిగిలిన వాటితో " ఎండలు ముదురుతున్నాయి. మన చెరువులో నీళ్లు రోజురోజుకు ఎండిపోతున్నాయి . ఇంకా ఎండలు ముదిరితే పూర్తిగా ఎండిపోవచ్చు . మనం ఉంటున్న ఈ చెరువు బాగా ఎండిపోయే వరకు ఆలస్యం చేస్తే మరో నీరున్న చోటుకి వెళ్ళలేం. నీళ్లు నిండుగా ఉండే మరో చోటుకి మనమిప్పుడే వెళ్లి పోదాం" అంది. దానికా మిగిలిన రెండూ జవాబివ్వలేదు.

వాటి జవాబు కోసం ఎదురుచూస్తూ ఇంకా ఉండడం మంచిది కాదనుకుంది దీర్ఘదర్శి. నీటి జాడలను అనుసరిస్తూ నెమ్మదిగా ఈదుతూ మరొక పెద్ద చెరువులోకి వెళ్ళింది.

ప్రాప్త కాలజ్ఞుడు, దీర్ఘ సూత్రుడు మాత్రం పాత చెరువులోనే ఉండిపోయారు . మరి కొద్ది రోజులకే చెరువులో నీరు ఎండిపోయింది. అటువైపుగా వెళుతున్న జాలర్లు ఎండిపోయిన చెరువుని చూసారు. ఎక్కువ చేపలు దొరుకుతాయన్న ఆశతో చెరువులో వలలు పన్నారు.

చెరువులో పన్నుతున్న వలల్ని , జాలరుల్ని చూసింది ప్రాప్తకాలజ్ఞుడు . "వాళ్ళు వల విసరగానే వల త్రాడుని గట్టిగా పళ్ళతో కొరికి పట్టుకుంటాను. జాలరి ఆ వలను ఒడ్డుకు లాగే సమయం చూసి వలను వదిలేసి బురదలో పడి ప్రాణాలు కాపాడుకుంటాను" అని ఆలోచించింది. అది అనుకున్నట్టే చేసి ప్రాణం కాపాడుకుంది.

మూడో చేప దీర్ఘసూత్రుడికి ఎటువంటి ఆలోచన కలగలేదు. దీంతో జాలరికి చిక్కి ప్రాణం పోగొట్టుకుంది.

దూరదృష్టితో పనిని ముందుగానే తెలుసుకోగలిగి, అందుకు ప్రతి చర్యను చేపట్టాలి. అలా ఆలోచించని మూర్ఖుడు దీర్ఘసూత్రుడు అనే చేప లాగా ఇబ్బందులు పడతాడు. అప్పటికప్పుడు తట్టిన ఉపాయాలతో ధైర్యంగా పని చేసుకుపోయేవాడు ప్రాప్తకాలజ్ఞుడిలాగా ఎప్పుడూ సందేహంతో కూడిన బ్రతుకు బ్రతుకుతాడు. రాబోయే పనిని ముందుగానే ఊహించుకొని సమర్ధంగా , యుక్తిగా పని చేసుకొనే నీతిమంతుడు దీర్ఘదర్శి అనే చేపలాగా సుఖంగా ఉంటాడు.

పై కథ చదివితే మనకు అర్థమయ్యేది ఒక్కటే. ముందుచూపుతో వ్యవహరించేవాళ్ళు ఎదురవ్వబోయే కష్టాలను తప్పించుకుని సుఖంగా ఉంటారు. కాబట్టి భవిష్యత్ ని చక్కగా నిర్మించుకోవాలంటే ముందుచూపుతో వ్యవహరించడం అవసరం. అందుకని మనం ముందుచూపు అనే అంశం గురించి క్షుణ్ణంగా తెలుసుకుందాం .

"రేపటి విజయం ఈరోజు చేసే ఆలోచన మీద ఆధారపడి ఉంటుంది" అని పెద్దల మాట. మన జీవితంలో తెలివైన వారిని గమనిస్తే, వారికి ఒక ప్రత్యేకమైన గుణం కనిపిస్తుంది. అదే ముందుచూపు. రాబోయే కాలాన్ని అంచనా వేసి, దానికి అనుగుణంగా సిద్ధమవ్వడాన్నే ముందుచూపు అంటారు. ఇది పెద్దవారికి మాత్రమే

కాకుండా అందరికీ అవసరం. విద్యార్థి దశ నుండే పిల్లలందరూ అలవాటు చేసుకోవాల్సిన అద్భుతమైన లక్షణమిది.

మనిషిని జంతువుల నుంచి వేరు చేసే ప్రధాన లక్షణాల్లో ముందుచూపు ఒకటి. రాబోయే పరిణామాలను ముందే ఊహించి, దానికి తగ్గట్టు వర్తమానంలోనే చర్యలు తీసుకోవడమనే గుణం ఉన్నవారు జీవితంలో నిలదొక్కుకుని, విజయపథంలో దూసుకుపోతారు. అందుకే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలనుకునే పిల్లలు ముందుచూపుతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

పంట కొరకు రైతు బాగుగా దున్నును

పిదప విత్తు వేసి పెంచు పంట

ముందు చూపు లేక ముందుకు కూడెట్లు

చేరు బాల! వినుము తేరుకొనుము/

అని కవి దానా గారు రాసిన పద్యంలో ముందు చూపుతో రైతులు పంటలు పండించి జనులకు ఆహారం అందిస్తున్న విషయం వర్ణించారు. మిగతా ఏయే విషయాల్లో ముందుచూపు అవసరమో తెలుసుకుందాం.

పరీక్షలు సమీపిస్తున్నాయని గ్రహించి, రోజు చదువుకుంటే విజయం సులభమవుతుంది. సమయపాలన పాటించడం, పుస్తకాలను క్రమబద్ధంగా ఉంచడం,తల్లిదండ్రులు, గురువుల సూచనలను గౌరవించడం వంటివన్నీ ముందుచూపు వల్ల కలిగే సత్ఫలితాలే. వర్షం పడుతుందని ముందే తెలుసుకుని గొడుగు తీసుకెళ్లడం, ఎండల్లో బయటికి వెళ్లే పని ఉన్నప్పుడు నీళ్ల సీసా తీసుకువెళ్లడం, దేవాలయాలకు వెళ్ళేటప్పుడు బిచ్చగాళ్లకు వెయ్యడానికి తగినంత చిల్లర నాణాలు తీసుకువెళ్లడం, బస్సు లేదా రైలు ప్రయాణాల్లో ఉన్నప్పుడు మార్గమధ్యంలో అవసరాలు తీర్చుకోడానికి తగిన విధంగా కరెన్సీ నోట్లను తీసుకువెళ్లడం వంటి చిన్న చిన్న విషయాలు కూడ ముందుచూపుకు ఉదాహరణలు.

ఇవి కాకుండా మరికొన్ని ముఖ్యవిషయాల్లో ముందుచూపు అవసరం. వాటిలో పర్యావరణం - మొక్కలు నాటడం విషయం మొదటిది. ఈ రోజు ఒక మొక్క నాటితే, అది వెంటనే పండ్లను ఇవ్వదు. కానీ, కొన్ని ఏళ్ల తర్వాత అది పెద్ద వృక్షమై మనకు నీడను, పండ్లను ఇస్తుంది. రేపటి తరం కోసం, స్వచ్ఛమైన గాలి కోసం ఈ రోజే మొక్కలు నాటడం ముందుచూపుతో మనందరం చేయాల్సిన పని.

నీటిని పొదుపు చేయడం విషయంలో ముందుచూపు అవసరం. నీరు వృథా అవుతుంటే చూస్తూ వదిలేయకూడదు . వర్షపు నీరు వృథా కాకుండా భూమిలో ఇంకిపోయేలా ఇంకుడు గుంతలు తవ్వించడం అవసరం. ఇప్పుడు నీటిని పొదుపు చేస్తే, భవిష్యత్తులో తాగునీరు దొరుకుతుందని గ్రహించడం బాధ్యతాయుతమైన లక్షణం.

చదువు మరియు కెరీర్ విషయంలో ముంచు చూపు అవసరం. ఒక విద్యార్థి పరీక్షల్లో ఉత్తీర్ణుడు కావడానికి పరిధులు విధించుకుని పాసు మార్కులకే పరిమితం కాకుండా భవిష్యత్తులో స్థిరపడబోయే వృత్తిని ముందే ఎంచుకుని అందుకోసం సరిపడే విధంగా సిద్ధమవ్వాలి. సమాజంలో గౌరవం ఉన్న మంచి వృత్తులెన్నో ఉన్నాయి. వాటిలో డాక్టర్, ఇంజనీర్, అడ్వకేట్ , చార్టర్డ్ అకౌంటెంట్ లేదా సైంటిస్ట్ మొదలైనది ఏదో ఒకటి

ఎంచుకుని అవి పొందడానికి అవసరమైన సబ్జెక్టులపై పట్టు సాధించడం ముందుచూపుతో చేసే పని అవుతుంది. అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరడానికి సహాయపడుతుంది.

ఆరోగ్యం మరియు వ్యాయామం విషయంలో ముందుచూపు అవసరం. బద్ధకంగా ఉండకుండా రోజూ వ్యాయామం చేయడం, ఆటలు ఆడటం అవసరం. అందువల్ల భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉంటారు. చిన్న వయసులోనే మంచి అలవాట్లు చేసుకోవడం వల్ల వయసు పెరిగాక అనారోగ్య సమస్యలు దరి చేరవు.

మేలుగోరి చేయు మేలైన పనులలో/

ముందు చూపు వలయు పుడమి గెలువ/

దూరదృష్టి కలిగి సారమ్ము గ్రహియించి/

చేయు పనులు ఫలము హాయి గాంచు/

అని కవి, సినీ గీత రచయిత తుంబలి శివాజీ గారు పద్యం రాస్తూ ముందుచూపుతో వ్యవహరించడం వల్ల గెలుపు సాధ్యమౌతుందని, మంచి ఫలితాలను పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే ముందుచూపుతో ఎటువంటి ప్రయోజనాలను పొందవచ్చునో తెలుసుకుందాం.

చేయాల్సిన పనుల్ని ముందే ప్రణాళిక వేసుకుని చేసుకోవడం వల్ల చివరి నిమిషంలో కంగారు పడాల్సిన అవసరం ఉండదు. ఒత్తిడి తగ్గుతుంది.

ఏ పరిస్థితినైనా ఎదుర్కోవడానికి మనం సిద్ధంగా ఉన్నామనే ధైర్యం కలుగుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

ముందుచూపు ఉన్నవారు తమకు వచ్చే అవకాశాలను ఇతరుల కంటే వేగంగా గుర్తించి విజయం సాధిస్తారు. అందువల్ల మంచి అవకాశాలను అందుకోగలుగుతారు.

రాబోయే ప్రమాదాన్ని ముందే ఊహించడం వల్ల పెద్ద నష్టాల నుండి తప్పించుకోవచ్చు. నష్ట నివారణకు ఉపయోగపడుతుంది.

అయితే ముందు చూపును ఎలా పెంపొందించుకోవాలో కూడ తెలుసుకుందాం.

చిన్న చిన్న ప్రణాళికలు వేయాలి. రోజూ ఏమి చేయాలో ఒక పట్టిక వేసుకుని దానిని అమలుకు ప్రయత్నించాలి.

భవిష్యత్తును అందంగా చూడాలనుకునేవారు గొప్ప కలలు కనాలి. వాటిని ముందుగా మనోఫలకంపై వీక్షించాలి . ఏకాగ్రతతో శ్రమించి ఆ కలలను వాస్తవాలుగా మలుచుకోవాలి.

"ప్రస్తుతం చేస్తున్న లేదా చేయబోతున్న పని వల్ల భవిష్యత్తులో లాభం కలుగుతుందా? లేక నష్టపోతామా?" అని ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి. అప్పుడే సరైన పనిని ఎంచుకోగలరు.

పిల్లలకు ఇచ్చిన చిన్న మొత్తాన్ని కూడా పిగ్గీ బ్యాంకులో దాచుకోవడం అలవాటు చేసుకోవాలి . అది భవిష్యత్తులో వారికి నచ్చిన పుస్తకం లేదా ఆట వస్తువు కొనడానికి ఉపయోగపడుతుంది. నేటి పొదుపు రేపటి మదుపు అనే విధంగా సహాయపడుతుంది.

స్కూలు డైరీని క్రమంగా అనుసరించడం, హోంవర్క్‌ను వాయిదా వేయకుండా పూర్తి చేయడం నేర్చుకోవాలి. అలా చేయడం వల్ల క్రమశిక్షణ అలవాటై మంచి ఎదుగుదలకి తోడ్పడుతుంది.

ముందుచూపు ఉన్న వ్యక్తి కచ్చితంగా అది లేనివాడు కన్నా బాగా పని చేయగలుగుతాడు. ముందుచూపు అనేది జీవితానికి ఒక ప్రణాళిక లాంటిది. అదే మనల్ని ముందుకు నడిపిస్తుంది. ఏ పని చేయాలన్నా జీవితానికి అది ఎలా ఉపయోగపడుతుందోనని ముందుగానే మనసులో ప్రశ్నించుకోవాలి.

స్పష్టమైన ముందుచూపు ఉన్నవాళ్లు జీవితంలో పక్కదారులు పట్టరు. సహజంగానే చేయాలనుకున్న వాటి మీద దృష్టిని కేంద్రీకరించి పూర్తిచేస్తారు. వాళ్ళ ముందుచూపే వారికి మార్గ నిర్దేశం చేస్తూ ముందుకు దారి చూపిస్తుంది.

ముందుచూపు ఉన్న పిల్లలు పరీక్షల్లో, ఆటల్లో, జీవితంలో గెలుస్తారు. వారు వైఫల్యాలను తగ్గించుకుని, మంచి నాయకులుగా మారతారు. ఇలాంటి గుణం పెంచుకుంటే భవిష్యత్తు ప్రకాశవంతంగా మారుతుంది.

ముందుచూపు కలిగిన వ్యక్తి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుంటాడు. సమయాన్ని వృథా చేయడు. కష్టానికి భయపడడు. బాధ్యతగా వ్యవహరిస్తాడు. అలాంటివాడు వ్యక్తిగతంగానే కాకుండా సమాజానికి కూడా ఆదర్శంగా నిలుస్తాడు.

అంతేకాదు పనులను వాయిదా వేసే తత్త్వం ఉండదు. తర్వాత చేద్దామనే అలసత్వం వారిలో కనబడదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముందే చేసుకుంటారు. ఏదైనా పని అనుకున్నట్లు జరగకపోతే ఏం చేయాలో వీరి దగ్గర రెండవ ప్రణాళిక సిద్ధంగా ఉంటుంది.

చుట్టూ ఉన్న ప్రపంచంలో ఏం జరుగుతుందో నిరంతరం గమనిస్తూ ఉంటారు. అందుకు తగ్గట్టు తమని తాము మార్చుకుంటారు.

ముందుచూపు కలిగి ఉండటమనేది పిల్లలకు అత్యంత అవసరమైన ముఖ్యమైన గుణం. ఇది వారిని భవిష్యత్తులో సమస్యలను ముందుగానే గుర్తించగలిగేలా, సరైన నిర్ణయాలు తీసుకునేలా సహాయపడుతుంది.

మానవుడు ఇప్పటిదాకా చేసిన ఆవిష్కరణలన్నీ ముందు అతని మనోనేత్రం ద్వారా దర్శించిన తర్వాతనే బాహ్య ప్రపంచంలో కనుగొనబడ్డాయి. దేనినైతే సాధించాలనుకుంటున్నారో దానిపై స్పష్టమైన అవగాహన ఉండి మనసులో దాన్ని ముందే చూడగలగాలి . అప్పుడే జీవితంలో సాధించగలరు

నేటి వేగవంతమైన ప్రపంచంలో కేవలం కష్టపడటం మాత్రమే సరిపోదు. చురుకుగా , తెలివిగా ఆలోచించడం కూడా ముఖ్యం.

మారుతున్న టెక్నాలజీ, పోటీ పెరుగుతున్న క్రీడల రంగంలో ముందుచూపు ఉన్నవారే విజేతలుగా నిలుస్తున్నారు.

క్రీడల్లో గెలవాలంటే శారీరక బలం ఉంటే సరిపోదు. మానసిక సన్నద్ధతతో బాటు నిరంతర శారీరక శ్రమతో కూడిన ప్రాక్టీస్ అవసరం. అవసరమైన టెక్నిక్స్ అభ్యసిస్తూ ఆట మీద పట్టు సాధించగలిగినప్పుడే విజయం సాధించగలరు. దీనికి కావాల్సింది ముందుచూపు .

గేమ్ ప్లాన్:- ఒక క్రికెట్ బ్యాటర్ బంతి పడకముందే, బౌలర్ వేసే వేగాన్ని బట్టి షాట్ ఎలా ఆడాలో ఊహించడం ముందుచూపు.

ఫిట్‌నెస్:- టోర్నమెంట్ నెల రోజుల తర్వాత ఉన్నా, ఈరోజే కఠినమైన శిక్షణ ప్రారంభించడం ముందుచూపు.

చదరంగం (Chess): - చెస్ ఆడేటప్పుడు మనం వేసే ఒక అడుగు వల్ల, ప్రత్యర్థి తర్వాతి ఐదు అడుగులు ఎలా వేస్తాడో ముందే ఆలోచించడమే అసలైన విజేత లక్షణం.

ఇక టెక్నాలజీ మరియు డిజిటల్ ప్రపంచంలో ముందుచూపు ఎలా ఉపయోగపడుతుందో చూద్దాం. నేటి డిజిటల్ యుగంలో ముందుచూపు లేకపోతే వెనుకబడిపోతారు. భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), రోబోటిక్స్ వంటివి కీలకం కాబోతున్నాయి. కాబట్టి, విద్యార్థులు ప్రాథమిక కోడింగ్ లేదా టెక్నాలజీపై అవగాహన పెంచుకోవడం ముందుచూపు అవుతుంది .

చరవాణి, మెయిల్ , ఫోను పే , ఇంటర్నెట్ బ్యాంకింగ్ వంటి వాటి పాస్‌వర్డ్‌లను రహస్యంగా ఉంచుకోవడం, తెలియని లింక్‌లను క్లిక్ చేయకపోవడం కూడా ముందుచూపే. "క్లిక్ చేస్తే ఏమవుతుంది?" అని ముందే ఆలోచించడం వల్ల మన డేటా సురక్షితంగా ఉంటుంది.

తరువాత చెప్పుకోవాల్సిన అంశం పర్యావరణం మరియు వనరులు. ఆధునిక కాలంలో మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య పర్యావరణం. పర్యావరణాన్ని కాపాడు కోవడానికి అవసరమైన చర్యలను ముందు చూపుతో ఆలోచించగలిగితేనే సక్రమమైన నివారణ చర్యలు చేపట్టగలగలుగుతారు.

స్వార్థ పరులైన మానవుల చర్యల వల్ల అడవులు తరిగిపోతున్నాయి. వ్యవసాయ భూములు తగ్గిపోయి రియల్ ఎస్టేట్ పెరగడంతో కాంక్రీట్ జంగిల్ గా మారుతున్న ప్రపంచమే ఎటుచూసినా కనబడుతుంది. అడవి జంతువులు జనం మధ్యలోకి వచ్చేస్తున్నాయి. దీనిని మార్చాల్సిన అవసరం ఉంది. అందుకోసం ఎక్కువ మొక్కలు నాటాలి . అడవులను కాపాడుకోవాలి . పచ్చదనం పెంచాలి .

ఎక్కువ వినియోగం కారణంగా ఇంధన వనరులైన పెట్రోల్, బొగ్గు వంటివి తరిగిపోతాయని గ్రహించాలి . సౌరశక్తి (Solar Power) లేదా ఎలక్ట్రిక్ వాహనాల వైపు దృష్టి పెట్టడం అవసరమని గుర్తించాలి . అది ప్రపంచం చూపాల్సిన ముందుచూపు.

ప్లాస్టిక్ నియంత్రణ: - ఈరోజు మనం వాడే ప్లాస్టిక్ వల్ల వంద ఏళ్ల తర్వాత భూమి పాడవుతుందని ఆలోచించి, దానిని వాడటం ఆపడమే నిజమైన బాధ్యతతో కూడిన ముందుచూపు.

పూర్వకాలంలో డబ్బును కేవలం దాచుకునేవారు, కానీ ఇప్పుడు దాన్ని సరైన చోట పెట్టుబడి పెట్టడం (Investment) ముందుచూపు అనిపించుకుంటుంది. చిన్నప్పటి నుండే అనవసరమైన ఆన్‌లైన్ షాపింగ్ తగ్గించి, డబ్బు విలువ తెలుసుకోవడం భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు రాకుండా కాపాడుతుంది.

చీమ ముందు చూపు చిన్నారి! గ్రహియించు
ఎండ నాడు తిండి గింజ దాయు
వాన నాడు సుఖము వానికెరుకాయెరా!
ప్రకృతి పాఠ మిదియె పాప! వినుమ!

అని కవి దానా గారు చీమ యొక్క ముందుచూపుని వర్ణిస్తూ పద్యం రాశారు. ఎండాకాలంలో ఆహారాన్ని సంపాదించి దాచుకునే చీమలు వర్షాకాలంలో సుఖంగా ఉంటాయని చెప్పారు.

అలాగే ముందుచూపుతో వ్యవహరించడం వల్ల కొందరు చేసిన పనులు వారిని ప్రపంచం మెచ్చే గొప్ప వ్యక్తులుగా మార్చింది . ముందుచూపు కేవలం ఒక ఆలోచన మాత్రమే కాదని, అది ఒక అద్భుతమైన వ్యూహమని చరిత్రను పరిశీలిస్తే తెలుస్తుంది.

ఛత్రపతి శివాజీ మహారాజ్ కి భవిష్యత్తులో విదేశీయులు సముద్ర మార్గం ద్వారా భారత్‌పై దండెత్తుతారని ముందే తెలుసు. అందుకే ఆయన అప్పట్లోనే బలమైన "నౌకాదళాన్ని"నిర్మించాడు. అందుకే ఆయన్ని 'భారత నౌకాదళ పితామహుడు' అంటారు. శత్రువు రాకముందే తీర ప్రాంతంలో కోటలు కట్టడం ఆయన ముందుచూపుకు నిదర్శనం.

ఒక చిన్న బాలుడైన చంద్రగుప్తుడిని చూసి, అతడు భవిష్యత్తులో భారతదేశాన్ని ఏకం చేయగలడని చాణక్యుడు ఊహించాడు. అలెగ్జాండర్ దండయాత్రల వల్ల దేశానికి ముప్పు ఉందని గ్రహించి, ముందే చిన్న చిన్న రాజ్యాలన్నింటినీ కలిపి ఒక మహా సామ్రాజ్యాన్ని స్థాపించేలా ప్రణాళిక వేశాడు. ఆయన రాసిన 'అర్థశాస్త్రం' నేటికీ పరిపాలనలో ముందుచూపుకు ఒక మార్గదర్శిగా పనిచేస్తుంది.

భారత రాజ్యాంగాన్ని రచించేటప్పుడు డా. బి. ఆర్ . అంబేద్కర్ ముందుచూపుతో వ్యవహరించారు. భవిష్యత్తులో భారతదేశం ఎదుర్కోబోయే సామాజిక, ఆర్థిక సమస్యలను ఊహించి, అందరికీ సమాన హక్కులు కల్పించేలా చట్టాలను రూపొందించారు. వందల ఏళ్ల తర్వాత కూడా దేశం ఐక్యంగా ఉండాలనే ఆయన ముందుచూపే నేడు మన ప్రజాస్వామ్యానికి పునాది అయింది .

సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఒక ఇంజనీర్ మాత్రమే కాదు. గొప్ప ముందుచూపు ఉన్న వ్యక్తి. మైసూరులో కృష్ణరాజ సాగర్ ఆనకట్ట కట్టేటప్పుడు, వంద ఏళ్ల తర్వాత పెరిగే జనాభాకు సరిపడా నీరు అందాలని ప్లాన్ చేశారు. ఆయన అప్పట్లో వేసిన ఆలోచనల వల్లే నేటికీ లక్షలాది ఎకరాలకు నీరు అందుతోంది.

వీటి నుండి నేర్చుకోవాల్సిన పాఠం ఒకటుంది. వారంతా కేవలం అప్పటి గురించి మాత్రమే ఆలోచించి ఉంటే, చరిత్రలో వారు నిలిచేవారు కాదు. రేపటి తరాల బాగుకోసం, దేశ భద్రత కోసం చేసిన వారి ఆలోచనలే వారిని చిరంజీవులను చేశాయి.

రేపు కొరకు ముందు చూపు యున్నను జాలు

చేరి పనిని మనము చేసినట్టి

ముందుచూపులేక మున్ను చేపల కథల్

తెలియకుండ చావు దెచ్చుకొనియె/

అని కవి దానాగారు పద్యం రాస్తూ ముందుచూపు లేని చేపల్లాగా ఆపదలో పడొద్దని హెచ్చరిస్తారు. ముందు చూపు అవసరం గుర్తించి నడుచుకోవాలని బోధిస్తారు. ముందుచూపుని ఎలా పెంచుకోవాలో తెలుసుకుందాం.

భవిష్యత్తుపై దృష్టి లేనివారు, రేపటి రోజుని మనోనేత్రంపై దర్శించలేని వారు , స్తబ్ధత మనస్తత్వం కలవారు పిరికివారుగా ప్రతిదానికి సందేహిస్తుంటారు . వాళ్ళు ఎక్కువగా అదృష్టాన్ని శకునాల్ని నమ్ముతారు . సొంత ఆలోచనలు బలహీనంగా ఉండి ఇతరుల మీద ఆధారపడుతూ ఏదైనా అనుకున్నది సాధించలేకపోతే ఇదంతా మా ఖర్మ అనుకుంటారు .

జీవితంలో ఎవరికి వారే దూరదృష్టిని పెంచుకుని విజయాలను సొంతం చేసుకోవడం వారి బాధ్యత . జీవితం నుంచి ఏమి కోరుకుంటున్నారో ముందుగా తెలుసుకోవాలి. ఏమి సాధించాలనుకుంటున్నారో, ఎప్పటిలోగా సాధించాలనుకుంటున్నారో ముందుగానే ఊహించగలగాలి. ప్రతి ఒక్కరి దృష్టి వారి లోని కలలకు ఒక రూపాన్ని ఇస్తుంది. ఆ రూపానికి స్పష్టతను కలిగిస్తుంది. ఈ విజువలైజేషన్ కి అనంతమైన శక్తి ఉంది . అది వ్యక్తుల్ని ముందుకు నడిపించి అనుకున్నది సాధించేటట్లుగా చేస్తుంది. అది వారి వారి నిర్ణయాలకు, ప్రయత్నాలకు ఇంధనంగా పనిచేసి వాటిని సాకారం చేయిస్తుంది.

అందుకు ప్రతిరోజు "నా చర్యలు రేపు ఎలా ఉంటాయి?" అని ప్రశ్నించుకోవాలి.

జీవితంలో విజయాలు సాధించిన గొప్పవారి స్ఫూర్తిదాయక కథలు విన్నట్టయితే ప్రేరణ కలుగుతుంది.

థామస్ ఆల్వా ఎడిసన్ బల్బు కనుగొనడానికి వందల సార్లు ప్రయత్నించాడు. అది చదివిన వారు తక్కువ వైఫల్యాలకు విసిగిపోయి విరమించడం మానుకుంటారు.

నిజ శక్తులు విలసిల్లగ
ప్రజతో బంధాలు చెలగి రహియించవలెన్
రుజువైన ముందుచూపే
ధ్వజమై జయతీరములకు వడి తోడ్కొనెడున్.

అంటారు కవి , సినీ గీత రచయిత తుంబలి శివాజీ. పద్యం యొక్క భావం ఏమిటంటే మనలో ఉన్న నిజమైన శక్తులు (సామర్థ్యాలు, విలువలు) పూర్తిగా వెలుగులోకి రావాలంటే, ప్రజలతో బలమైన బంధాలు ఏర్పడి, అవి స్థిరంగా నిలవాలి. అలాగే, స్పష్టమైన ముందుచూపు (దూరదృష్టి, లక్ష్యస్పష్టత) ఉంటే, అదే ఒక ధ్వజంలా మారి, మనలను విజయ తీరాల వైపు వేగంగా నడిపిస్తుంది.

కొంతమంది గొప్ప వారి జీవిత చరిత్రలను పరిశీలిస్తే వారు ఆ స్థాయికి చేరడానికి వారికి ఉన్న దూరదృష్టి ఉపయోగపడిందని, వారి అంతర్దృష్టి లక్ష్యాలు గొప్ప ఉన్నతంగా ఉండేవని అర్థమవుతుంది.

మహాత్మా గాంధీ గారి దృష్టి ఎప్పుడూ బానిసత్వంలో మగ్గుతున్న మన దేశాన్ని స్వాతంత్ర భారతదేశంగా చూడాలని ఉండేది.అందుకే అహరహం శ్రమించి తన కలను నిజం చేసారు.

మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ కి దేశంలోని అన్ని జాతుల వారు అన్ని భాషలవారు కలసి ఒక్కటిగా ప్రశాంతంగా జీవించాలని విజన్ ఉండేది. దానిని సాధించారు.

మదర్ తెరిసాకు పేదలను, అనాథలను జాగ్రత్తగా చూసుకొని వారిని సంతోష పరచాలని ఉండేది.అందుకోసం జీవితమంతా శ్రమించింది.

వాల్ట్ డిస్నీ కి ప్రపంచంలో గొప్పదైన అమ్యూజ్మెంట్ పార్క్ నిర్మించాలని కలలు కన్నాడు .ఆ కలలను సాకారం చేసుకున్నాడు.

ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్టు శిఖరం ఎక్కి చరిత్ర సృష్టించాలని కలలు కన్నారు ఇద్దరు. వారి కల 1953 మే 29న నెరవేరింది. ఎడ్మండ్ హిల్లరీ (న్యూజిలాండ్) మరియు టెన్సింగ్ నార్గే (నేపాల్) మొట్టమొదటిసారిగా ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించి తమ కలను నిజం చేసుకున్నారు.

వారందరూ జీవితంలో అసాధ్యం అనుకున్న వాటిని కఠోర శ్రమ ప్రదర్శించి కష్టాలకు, ప్రతిబంధకాలకు భయపడకుండా వెనకంజ వేయకుండా సాధించారు. చరిత్ర సృష్టించారు.

“రాబోవు నాపదలను/
లేబోనీయకయె ముందు తెలిసి మెలంగున్/
ప్రాబల్యము గలవాడే/
శోభిలు నిల నతడె సుమతి ” అని ఒక పద్యకవి అన్నారు . ముందుచూపుతో మెలిగితే ఆపదలను తప్పించుకోగలరని పద్యం యొక్క భావం.

ముందుచూపు ఉన్నవారు ఉత్సాహంగా జీవించగలరు. అది మనుగడకు ఎంతో ఉపయోగపడుతుంది . మనం చనిపోయిన తర్వాత మన గురించి ప్రజలు ఏమి గుర్తుంచుకోవాలి. ఏమనుకుంటారు? ‘చెడుగానా? లేక మంచిగానా? ‘ ఇలా ఆలోచించగలిగి జీవించినప్పుడు విలువలతో జీవించగలరు. ముందుచూపు ఉన్నవారికి “ కాదు, లేదు, కానీ, తెలియదు” ఇలాంటి పదాలు తెలియవు. “ చేయి లేక చావు” (Do or die) లాంటి పదాలు మాత్రమే తెలుస్తాయి. అవి ఉంటే అనుకున్నది సాధించడానికి ఎంత ఉత్సాహానికైనా సిద్ధపడతారు.

ముందుచూపు అనేది ఒక దిక్సూచి వంటిది. అది మనల్ని సరైన మార్గంలో నడిపిస్తుంది. జీవితం అనే ప్రయాణంలో ఆకస్మికంగా వచ్చే సమస్యలను ఎదుర్కోవాలన్నా, అపారమైన విజయాన్ని అందుకోవాలన్నా ముందుచూపు అవశ్యం. కాబట్టి, విద్యార్థులందరూ 'వర్తమానంతో పాటు 'భవిష్యత్తు గురించి కూడా ఆలోచించే గొప్ప గుణాన్ని అలవర్చుకోవాలి.

ముందుచూపు అనేది జీవితానికి దిశానిర్దేశం చేసే దీపం లాంటిది. చిన్ననాటి నుంచే ఈ గుణాన్ని అలవాటు చేసుకుంటే భవిష్యత్తు సురక్షితంగా, సార్థకంగా ఉంటుంది. మీరెంత గొప్పగా ఆలోచిస్తే అంత గొప్పవారు కాగలరు అని మరవద్దు.

ఏకాగ్రతతో,  ఇష్టంతో పని చేస్తే మీ కలలు నిజమవుతాయి.  విజేతలు విజయం సాధించే వరకు పనిచేస్తూనే ఉంటారు.  ఆ విజేతలు మీలో ఎవరైనా కావచ్చు .

——@@@——